క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కోట: కోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పొదుపు సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం రత్నయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ చేతులమీదుగా 6,778 మంది సభ్యులకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.5.38కోట్లు పంపిణీ చేస్తారని ఏపీఎం ప్రకటనలో పేర్కొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

చిల్లకూరు: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. బల్లవోలు పంచాయతీలో గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మార్లగుంట సరిత, ఆర్ఐ రమ్యస్వాతి, ఏఎస్ఐ ప్రభాకర్, వీఆర్ఓ బాలాజి, పంచాయతీ కార్యదర్శి అల్లీ బాషా, ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సైదాపురం: స్థానిక పురుగుల మందు దుకాణాల్లో గురువారం ఏఓ హైమావతి తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పురుగుల మందులకు సంబంధించి రికార్డులను పరిశీలించి శాంపిల్స్‌ను తీసుకున్నామన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

కండలేరులో 10.118 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 10.118 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 260 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి విరాళం


ముస్లింలకు విరాళం ఇస్తున్న వినోద్‌కుమార్‌రెడ్డి

కోట: కోట జామియా మసీదు పరిధిలోని ఈద్గా ప్రహరీ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందించారు. వినోద్‌కుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి హరనాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం విరాళాన్ని ఆయన నివాసంలో ముస్లిం పెద్దలకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా, జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు చాంద్ బాషా, యస్థాని, షరీఫ్, అబ్దుల్లా, ఇంతియాజ్ పాల్గొన్నారు.

పాఠశాలలో పాము కలకలం

కోట: మండలంలోని తాటిగుంటచెరువు ప్రాథమిక పాఠశాలలో నాగుపాము విద్యార్థులను భయాందోళనకు గురిచేసింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాల మరుగుదొడ్డిలో పామును గుర్తించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పడంతో అక్కడకి చేరుకున్న వారు పామును చంపేసినట్లు హెచ్ఎం సుజాత తెలిపారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

గూడూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణనాయుడు తెలిపారు. గూడూరు రెండో పట్టణ పరిధిలో గురువారం ప్రజాపోరు యాత్రను నాయకులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నేతలు పనబాక కోటేశ్వరరావు, భైరప్ప, ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

వడ్డికండ్రిగలో వైద్య బృందం


గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం

దొరవారిసత్రం: వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన బెల్లంకొండ అంకయ్య(48) డెంగీ జ్వరంతో మృతిచెందాడని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీంతో గురువారం జిల్లా ఎపిడిమాలజిస్ట్ అధికారిణి లావణ్య వైద్య బృందంతో గ్రామంలో పర్యటించి మృతుడి రిపోర్టులను పరిశీలించారు. మృతుడు కొంతకాలంగా షుగర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. అవయవాలు కూడా పనిచేయకపోవడంతో అంకయ్య మృతి చెందినట్లు వైద్యబృందం నిర్ధారించింది. అనంతరం గ్రామంలో జ్వరంతో ఉన్న వారికి గుర్తించి మందులు అందజేశారు. అదేవిధంగా తాగు నీటికి వినియోగిస్తున్న బావిలోని నీళ్లను పరీక్షల నిమిత్తం పంపినట్లు వైద్యాధికారి చైతన్య తెలిపారు.

ప్రాణానికి తొలిమెట్టు.. హెల్మెట్టు!

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి
- వాహన రిజిస్ట్రేషన్‌లతో హెల్మెట్ లింకు
- నూతన చట్టం అమలుకు చర్యలు


రోడ్డు ప్రమాదాల్లో మృతదేహాలు (ఫైల్)


రోడ్డు ప్రమాదాల్లో మృతదేహాలు (ఫైల్)

సైదాపురం: రహదారుల్లో ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. దీనిలో భాగంగానే ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీసుశాఖ నిర్ణయం తీసుకుంటోంది. అటువంటి నిర్ణయమే వాహన రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్ లింకు చేసింది. కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయాల్లోనే హెల్మెట్ తీసుకోవాలనే షరతు విధించారు. హెల్మెట్ ఉంటేనే వాహనం రిజిస్ట్రేషన్ చేయాలని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాహన రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వాహన యజమాని కొత్త హెల్మెట్‌ను, దాని బిల్లును సమర్పిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంబంధింత అధికారులు పూర్తి చేసేలా ఈ నిబంధనలు రూపొందించారు. మోటారు వెహికల్ చట్టం నిబంధన–138(ఎఫ్) ప్రకారం వాహనాలు విక్రయించే డీలర్లు విధిగా హెల్మెట్‌ను అందుబాటులో ఉంచాలి. కానీ వాహనచోదకులు ఆసక్తి చూపనందున ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. డీలర్లు హెల్మెట్‌లు తప్పనిసరి చేస్తున్నా వాహన చోదకులు మాత్రం ఇంట్లోనే హెల్మెట్‌లు పెట్టి వాహనాలను నడుపుతున్నారు. ప్రధానంగా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లో ఇప్పటికే పోలీసు అధికారులు హెల్మెట్ వాడకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులను కూడా నిర్వహిస్తున్నారు.

129 సెక్షన్ ప్రకారం..

మోటారు వాహన చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నా ఆచరణకు నోచుకోలేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో దేశమంతా హెల్మెట్ వినియోగంపై దృష్టి మళ్లింది. రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు అమలు చేస్తున్నారు పోలీసులు. దీని కోసం ప్రత్యేక తనిఖీలను కూడా అధికారులు చేపడుతున్నారు. దీనికోసం అధిక జరిమానాలను కూడా విధిస్తున్నారు. కనీసం ఆ భయంతోనైనా హెల్మెట్ అలవాటు చేసుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

నాణ్యతలేని హెల్మెట్‌తో ప్రయోజనం శూన్యం

పోలీసు కేసుల నుంచి తప్పించుకునేందుకు నాణ్యతలేని హెల్మెట్‌లను కొనుగోలు చేయడం వల్ల ప్రయోజనం లేకపోగా ప్రమాదమే అధికమని అధికారులు సూచిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై లభించే హెల్మెట్లు తక్కువ ధరకు లభిస్తాయి కానీ ప్రాణ రక్షణకు గ్యారెంటీ ఉండదంటున్నారు. చిన్న చిన్న ప్రమాదాల్లో వాహన చోదకులు కిందపడితే హెల్మెట్ పగిలి వాటి వల్ల కూడా గాయాలపాలయ్యారన్న సందర్భాలు అనేకం ఉన్నాయనే విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు.

విస్తృత ప్రచారం అవసరం..

- హెల్మెట్‌ల వాడకంపై కరపత్రాలు పంచడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం చేసేలా ఆయా సంస్థలు ఆదేశాలు జారీ చేయాలి.
- పాఠశాలలు, కళాశాలల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలి.
- హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహన చోదకులకు నోటీసులు జారీ చేయాలి,.
- పట్టుబడితే తొలిసారిగా కౌన్సెలింగ్ చేసి వదిలి పెట్టాలి. పునరావృతమైతే భారీ జరిమానా విధించేలా పోలీసులు చొరవ చూపాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


వాహనచోదకులు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవు. ముఖ్యంగా యువత వాహనాలు నడిపే సమయాల్లో నిబంధనలు పాటించడం లేదు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు, వాహన చోదకులు ముందస్తుగా మోటారు వెహికల్ చట్టాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా వాహనాలు నడపాలి. – సుబ్రమణ్యం సీఐ రాపూరు

హెల్మెట్ తప్పనిసరి..


వాహన వినియోగదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలి. లేకుంటే మొదటిసారి అపరాధం విధిస్తాం. రెండో సారి, మూడో సారి హెల్మెట్ ధరించడకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. – విజయ్‌కుమార్, ఎస్ఐ సైదాపురం

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కుంభాభిషేకం నిర్వహించడంతో పాటు స్పటిక శివలింగాన్ని వైభవంగా ఏర్పేడుకు చెందిన వ్యాసాశ్రమ సద్గురు మళయాళ పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గూడూరుకు చెందిన పారిశ్రామిక వేత్త సిద్దారెడ్డి జనార్దనరెడ్డి ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఆయన మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులు ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, వెంకటసుధీర్‌రెడ్డి, ప్రణతి, శ్రేష్ట రూ.90 లక్షల నిధులు ఖర్చు చేసి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈక్రమంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ కుంభాభిషేక వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో పరిపూర్ణానందగిరి వారి చేతుల మీదుగా ముందుగా కలశ స్థాపన చేసిన అనంతరం ఆలయంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ముందుగా శివలింగ ప్రతిష్ఠను చేపట్టిన తరువాత మూడు అడుగుల స్పటిక లింగాన్ని ప్రతిష్ఠించిన తరువాత 40 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు యరటపల్లి జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

రామసాగరంలో దారుణం

సైదాపురం: బాలికను బెదిరించి లైంగికదాడికి పాల్పడిన సంఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని రామసాగరం గ్రామానికి చెందిన బాలిక(11)ను అదే గ్రామానికి చెందిన మస్తాన్‌బాషా (40) బెదిరించి లోబరుచుకున్నాడు. ఈ క్రమంలోనే అదును చూసి అత్యాచారానికి ఒడిగట్టాడు. దీంతో బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతో గురువారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు స్పందించి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

వెంకటగిరిరూరల్: ఆర్టీసీలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం చోటుచేసుకుంది. వెంకటగిరి సెబ్ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఎక్సైజ్ సీఐ కె వినయ్‌కుమార్ మాట్లాడారు. ఈ మేరకు తమిళనాడుకు చెందిన కాజు మొహిదీన్ వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, 3 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు విచారించగా రాజమండ్రికి చెందిన సతీష్ వద్ద కిలో గంజాయి రూ.3 వేల చొప్పున మూడు కిలోలు కొనుగోలు చేసి బస్సు మార్గం గుండా చెన్నైలోని మూర్తికి అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. చెన్నై వెళ్లేందుకు వెంకటగిరికి రావడంతో పట్టుబడినట్లు వెల్లడించారు. మొహిదీన్‌తోపాటు సతీష్, మూర్తిపై కేసు నమోదు చేశామని మొహిదుద్దీన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ మహబూబ్, కానిస్టేబుల్ రసూల్, వేణుగోపాల్, పుట్టయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

గూడూరురూరల్: మండలంలో వివిధ శాఖలకు సంబంధించి పలు సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ గురవయ్య మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా తాగునీరు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా వ్యవసాయ అధికారులు చొరవచూపాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో నాడు–నేడు పనులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలపై సమీక్షించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపీపీలు శ్రీనివాసులురెడ్డి, ఇంద్రాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఊటుకూరు యామిని, డిప్యూటీ తహసీల్దార్ శిరీషా, ఏఓ మురళీకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

తిరుపతి కల్చరల్: టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయం వద్ద ఉన్న పాత మ్యూజియంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తిరుమలలో ప్రతిరోజూ లక్ష మంది భక్తులు నిత్యాన్నదాన పథకం ద్వారా భోజనం చేస్తున్నారన్నారు. గతంలో తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుమల వచ్చిన ప్రతి భక్తుడూ అన్నదానంలో భోజనం చేసే విధంగా ఏర్పాటు చేశామన్నారు. టీటీడీ చైర్మన్‌గా శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం చైర్మన్, ఈవో కలిసి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు.

సామూహిక లక్ష తులసి పూజ


లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న మహిళలు

గూడూరురూరల్: పట్టణంలోని బాలాజీనగర్ కూడలి వద్ద ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక లక్ష తులసి పూజను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌రాజు, మురళీమోహన్‌రాజు, వాసుదేవరాజు వ్యవహరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలుగా పొనకా శివకుమార్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ వ్యవహరించారు.

మాజీ సైనిక ఉద్యోగికి టీడీపీ నేత వేధింపులు


ఆవేదన వ్యక్తం చేస్తున్న మాజీ సైనిక ఉద్యోగి కుటుంబసభ్యులు

డక్కిలి (బాలాయపల్లి): గడిచిన బాలాయపల్లి పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేయలేదన్న కారణంతో మాజీ సైనికోద్యోగి కుటుంబంపై టీడీపీ నేత వేధింపులకు పాల్పడుతున్నారని బాధితులు వాపోయారు. మాజీ సైనిక ఉద్యోగి చల్లా కోటేశ్వరరావు, చల్లా విజయమ్మ గురువారం బాలాయపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ విజయమ్మ తల్లి కురుగొండ మీనమ్మ పేరుతో 5 సెంట్లు ఇంటి నివాస స్థలాన్ని 2005లో పట్టాను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. ఆ స్థలంలో చిన్నపాటి రేకుల షెడ్డు నిర్మాణం చేస్తుండగా ఆ టీడీపీ చోట నేత రెవెన్యూ అధికారులను తమ ఇంటి పైకి పంపారు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణ, వీఆర్వోలు వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి తరచూ త్వరలో ఎన్నికలు వస్తున్నాయి. పార్టీ మారితే అప్పుడు నిర్మించుకో అని బెదిరిస్తున్నారని వాపోయారు. 18 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసిన కుటుంబాన్ని ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. వీరి దౌర్జన్యాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఆర్ఐ పూర్ణ, టీడీపీ చోటా నాయకుడు వేధింపులు తట్టుకోలేక తమ కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: టీడీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానాలు తమ పార్టీనే గెలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం వాకాడులోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. 14 ఏళ్లు పరిపాలించిన టీడీపీ పేదలను మోసం చేసి దోచుకుతినిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం కార్యక్రమాలు జనప్రభంజనంతో సభలు జగన్‌కు స్వాగతం పలుకుతున్నాయన్నారు. ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారన్నారు. జగనన్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తాను నాయకులకు, కార్యకర్తలు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరన్నారు.


నూతన వధువును ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

రాజశేఖర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, శ్రీహరి, గూడూరు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పాల్గొన్నారు.

శుభ కార్యాలకు హాజరైన నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పలు శుభ కార్యాల్లో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆశీర్వచనం చేశారు. ముందుగా డక్కిలి మండలంలోని పలుగోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చప్పిడి వెంకటరత్నం కుమార్తె కావ్య నలుగు వేడుకల్లో పాల్గొని నూతన వధువుని ఆశీర్వదించారు. అదేవిధంగా వెంకటగిరిలోని 16వ వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామయ్య నూతన గృహ ప్రవేశవేడుకల్లో నేదురుమల్లి పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి


రాపూరు: పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

రాపూరు: మండలంలో మార్చి 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. స్థానిక మండల కార్యాలయంలో గురువారం రాపూరు, వేపినాపి ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 4వేల 113 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, పోలీయో చుక్కలు వేసేందుకు 60 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్యులు రాజకుమారి, సుదర్శనమ్మ, ఎంఈఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు లింగమూర్తి పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మార్చి 3, 4, 5 తేదీల్లో జరిగే జాతీయ పల్స్‌పోలియో దినోత్సవాన్ని జయప్రదం చేయాలని డీవీ సత్రం, తొగరాముడి పీహెచ్‌సీ వైద్యులు చైతన్య, తరుణ్ కోరారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లుకు సమావేశం నిర్వహించి గురువారం అవగాహన కల్పించారు.

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట


నేదురుమల్లికి జ్ఞాపికను అందజేస్తున్న మైనారిటీలు

వెంకటగిరి(సైదాపురం): ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ముస్లిం, మైనార్టీ రాష్ట్ర జోనల్ కో–ఆర్డినేటర్ సయ్యద్ షఫి అహ్మద్‌ఖాదరి, రాష్ట్ర కార్యదర్శ షేక్ యస్థానిబాషా, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రసూల్ గురువారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉండి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని తెలిపారు. ముస్లింలు పఠాన్ ఫరీద్‌ఖాన్, సయ్యద్ ఖాదార్‌బాషా, జాఫర్ హుసేన్, కాలేషా పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజినీర్ల సేవలు ఎనలేనివి


శ్రీగిరినాథ్, రవీంద్రకుమార్‌లను సన్మానిస్తున్న అధికారులు

- ఎస్ఈ శంకరనారాయణ
- ఉద్యోగ విరమణ పొందిన ఈఈ, డీఈలకు ఘనసన్మానం

గూడూరురూరల్: పంచాయతీరాజ్ శాఖలో 38 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గూడూరు పంచాయతీరాజ్ ఈఈ శ్రీగిరినాథ్, డీఈ కె.వి.రవీంద్రకుమార్‌ల సేవలు ఎనలేనివని తిరుపతి జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ శంకరనారాయణ అన్నారు. గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం రాత్రి జరిగిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఈఈ శ్రీగిరినాథ్, డీఈ రవీంద్రకుమార్‌లను వివిధ శాఖల అధికారులు, అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ టి.సుభాష్‌బాబు, ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.వి.దయాళ్, కావలి, నెల్లూరు ఈఈ రవికుమార్, శివారెడ్డి, సర్దార్ హుస్సేన్, సత్యనారాయణ రెడ్డి, షౌకత్ హుస్సేన్ పాల్గొన్నారు.

సన్మానం


మండల విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం గురువారం పదవీ విరమణ చేయడంతో స్థానిక మండల విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కలిసి సుబ్రమణ్యంను సన్మానించారు. డీఈఓ శేఖర్, ఎంఈఓ2 శంకరయ్య పాల్గొన్నారు. - పెళ్లకూరు